క్లుప్తంగా

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ



తెనాలి అర్బన్: కాపు సంక్షేమ సేన మూడో ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం బండికళ్ల శ్యామ్‌ప్రసాద్ పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్స్ అందజేత



తెనాలి అర్బన్: రత్నాకరం రాము మిత్ర బృందం ఆధ్వర్యంలో బాలాజీరావుపేట భవిత కేంద్రంలోని ముగ్గురు దివ్యాంగులకు వీల్‌చైర్స్‌ను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాచబత్తుని ఉమామహేశ్వరరావు, శ్రీనివాస్, ఉపాధ్యాయులు సునీత, వై.రజనీకుమారి, ఎ.శారాగ్రేస్, జయమ్మ పాల్గొన్నారు.

రేపు తెనాలిలో భారత్ బచావో జిల్లా మహాసభ



తెనాలి అర్బన్: భారత్ బచావో సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 12న తెనాలిలోని ఎన్‌జీవో కల్యాణ మండపంలో జిల్లా మహాసభల్ని నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ భారత్ బచావో స్టేట్ కౌన్సిల్ మెంబర్ అందె శ్యామ్ పేర్కొన్నారు. తెనాలిలో గురువారం మహాసభల కరపత్రాల్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రామ్‌దేవ్, ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా, భారత్ బచావో జాతీయ వైస్ చైర్మన్ డాక్టర్ ఎం.ఎఫ్. గోపీనాథ్, కె.పావని, జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొంటారని చెప్పారు. పట్టణ ప్రజలంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అమనుల్లాఖాన్, షేక్ సుభాని, మహ్మద్ అల్లావుద్దీన్, సయ్యద్ షబ్బీర్, లోకం భాస్కరరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ట్రయల్ రన్



తెనాలి: క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా 1942 ఆగస్టు 12న జరిగిన పోరాటంలో అసువులు బాసిన తెనాలి అమరవీరుల సంస్మరణార్థం ఏటా ఆ రోజున తెనాలిలో జరిగే వీర సంస్మరణ దినోత్సవానికి రిహార్సల్స్‌గా గురువారం ట్రయల్ రన్ నిర్వహించారు. స్థానిక రణరంగచౌక్‌లో ఎన్‌సీసీ కో–ఆర్డినేటర్ ఆధ్వర్యంలో జరిగిన ట్రయల్ రన్‌లో 22వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్లు, వీఎస్సార్ అండ్ ఎన్‌వీఆర్ కాలేజి, అంబేడ్కర్ కాలేజి, రావి సాంబయ్య, ఎన్‌సీఆర్‌ఎం, ఎన్‌ఎస్‌ఎస్‌ఎం ఉన్నత పాఠశాలలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు మొత్తం 400 మంది వరకు పాల్గొన్నారు. పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి గాంధీచౌక్, మెయిన్ రోడ్డు, మార్కెట్ వంతెన మీదుగా క్విట్ ఇండియా అమరవీరుల స్తూపాలున్న రణరంగ చౌక్ వరకు మార్చ్‌ఫాస్ట్ ట్రయల్ రన్ కొనసాగింది. అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమాన్ని ఎన్‌సీసీ అధికారులు పులి భాస్కర్, పరిశా సర్దార్, స్వామి, సాయిబాబు, విజయసింహ, సామ్యానాయక్ పర్యవేక్షించారు.

'నా భూమి ..నా దేశం'పై అవగాహన ర్యాలీ

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రాతూరు గ్రామంలో నా భూమి..నా దేశం అనే కార్యక్రమంపై అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ ఎం.సుమన్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కేఎల్ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రాతూరులో మొక్కల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. మొక్కలు నాటిన ఈసీఈ విభాగ విద్యార్థులను, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి, జి.చంద్రశేఖర్‌ను వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు అభినందించారు.

'వార్డులో ఒక రోజు'కు శ్రీకారం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తాజా కార్యక్రమం
- తొలిగా పట్టణ మూడో వార్డులో పగలంతా పర్యటన
- గడప గడపకు మన ప్రభుత్వం వినతులపై సమీక్ష
- జవాబుదారీతనం కోసమేనన్న ఎమ్మెల్యే



సచివాలయంలో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: గుడ్ మార్నింగ్ తెనాలి...లోకల్ ఎమ్మెల్యేతో లోకల్ సమస్యలు...కార్యక్రమాలతో నియోజకవర్గ ప్రజల్లో ఉంటూ ప్రభుత్వం నిర్దేశించిన గడప గడపకు మన ప్రభుత్వం పర్యటనలో కొనసాగుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కొత్తగా వార్డులో ఒకరోజుకు శ్రీకారం చుట్టారు. గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన వినతుల్లో పరిష్కారం ఏమేరకు జరిగింది.. అభివృద్ధి పనుల పురోగతి ఎలాగుంది? అనే క్షేత్రస్థాయి సమీక్షకు పూనుకున్నారు. తొలిగా పట్టణ మూడో వార్డు సచివాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు 'వార్డులో ఒకరోజు' ఆరంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కమిషనర్ ఎం.జస్వంతరావు, వార్డు కౌన్సిలరు ఆవుల కోటయ్య, ఇంజినీరింగ్ అధికారుల సహా అక్కడకు వెళ్లిన ఎమ్మెల్యే శివకుమార్, వార్డు సచివాలయ సిబ్బందితో రెండు గంటలు గడిపారు. ‹గడప గడపకు›లో సచివాలయం పరిధిలో ప్రజల్నుంచి వచ్చిన వినతులు మొత్తం 76. వీటిలో పింఛను వినతులు 20 కాగా, ఇళ్ల స్థలాలు కోసం 12 మంది అభ్యర్థించారు. మిగిలిన వాటిలో అమ్మ ఒడి, ఈబీసీ నేస్తం, అగ్రి గోల్డ్, సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు కావాలని, విద్యుత్ స్తంభాలు వేయించాలని వినతులు ఉన్నాయి. అర్హులైన వారితో ఇప్పటికే దరఖాస్తు చేయించారు. ఆదాయ పన్ను చెల్లింపు సహా ఇతర సాంకేతిక కారణాలతో అనర్హులకు ఆ కారణాన్ని తెలియజేస్తారు. మూడో వార్డులో 602 మందికి ఇళ్ల స్థలాల్ని ఇచ్చారు. రూ.85.85లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. అక్కడ మొత్తం 12 రోడ్లు మంజూరుచేయగా, వీటిలో 10 రోడ్లు, డ్రెయిన్లు పూర్తయినట్టు తెలుసుకున్నారు.

మధ్యాహ్నం వార్డు వలంటీర్లతో సమావేశం

ఎమ్మెల్యే మధ్యాహ్నం వార్డు వలంటీర్లతో సమావేశమయ్యారు. వారి బాగోగుల్ని అడిగి తెలుసుకున్నారు. వార్డులో సంక్షేమం అమలు, సామాజిక సమస్యల్ని ఆరా తీశారు. గంటన్నరపాటు సమీక్ష తదుపరి మధ్యాహ్నం 2 గంటలకు వార్డు కౌన్సిలరు ఆవుల కోటయ్య ఇంట్లో ఆ కుటుంబసభ్యులతో కలసి భోజనం చేశారు. వార్డు అభివృద్ధిపై ఆయన మనోగతాన్ని తెలుసుకున్నారు. అవసరమైన సూచనలు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు వైఎస్సార్ సీపీ ముఖ్యకార్యకర్తలు, వలంటీర్లు, బూత్ ఏజెంట్లు, గృహసారథులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్టీ కార్యకర్తల యోగక్షేమాల్ని తెలుసుకున్నారు. రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పనితీరుకు అభిప్రాయాలను తెలుసుకున్నారు.

సిమెంటు రోడ్లు, డ్రెయిన్లు ప్రారంభం

ప్రభుత్వం కేటాయించిన రూ.20 లక్షలతో నిర్మించిన రెండు సిమెంటు రోడ్లు, డ్రెయిన్లను ఎమ్మెల్యే శివకుమార్ ప్రారంభించారు. అక్కడే విలేకరులతో మాట్లాడుతూ, వార్డులో ఒకరోజు పర్యటన, ప్రజల సమస్యలపై తన జవాబుదారీతనానికి నిదర్శనంగా చెప్పారు. వారంలో నాలుగు రోజుల పాటు నాలుగు వార్డుల్లో రోజంతా ఇదే తీరుగా ప్రజాసమస్యలపై సమీక్షిస్తూ, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేకు చెప్పిన విషయంపై ఏం చేశారు? అనేది తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. అర్హులకు ప్రభుత్వ సంక్షేమం అందించడం, సాంకేతికంగా వీలుకాకుంటే సమాధానం ఇవ్వడం తన కర్తవ్యమని తెలిపారు. ఆ దిశగా ముందుకు సాగుతానని వివరించారు. కొంతమంది స్థానికులు వచ్చి, తమ వ్యక్తిగత, సామాజిక సమస్యల్ని ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని కూడా పరిగణనలోకి తీసుకుంటానని హామీనిచ్చారు.

నేడు తెనాలిలో మెగా జాబ్ మేళా

తెనాలి: నియోజకవర్గంలో యువత ఆర్థిక స్వావలంబన దిశగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న మెగా జాబ్ మేళా ఈసారి శుక్రవారం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సహకారంతో స్థానిక ఏఎస్‌ఎన్ డిగ్రీ కాలేజీలో ఉదయం 9 గంటలకు ఆరంభమయ్యే జాబ్‌మేళాలో 30 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారు. సుమారుగా 1086 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

తెనాలి అర్బన్: కృష్ణదేవరాయ ఎడ్యుకేషనల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ తెనాలి డివిజన్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు సంస్థ కార్యదర్శి తాడికొండ చిన్నబ్బాయి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్‌లలో అత్యధిక మార్కులు సాధించిన పేద విద్యార్థులు ఈ నెల 27లోపు దరఖాస్తులు అందజేయాలని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9440438904, 98491216687లో సంప్రదించాలని సూచించారు.

నులి పురుగుల నివారణతోనే విద్యార్థుల్లో ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్



విద్యార్థులతో మాత్రలు మింగిస్తున్న వైస్‌చైర్మన్ హరిప్రసాద్



విద్యార్థులతో టాబ్లెట్లను మింగిస్తున్న సర్పంచ్ పిల్లి రాధిక, డాక్టర్ ప్రియాంక

తెనాలి అర్బన్: ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సున్న ప్రతి ఒక్కరూ ఆల్బెండజోల్ టాబ్లెట్‌లను వేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ సూచించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని చెంచుపేటలోని కేఎస్‌ఎం హైస్కూలులో గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నులిపురుగులు ఉంటే తిన్న ఆహారం సరిగా జీర్ణం కాదని, తద్వారా రక్తహీనత పెరుగుతుందని చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మార్చి, ఆగస్టులలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను పంపిణీ చేస్తామని, విద్యార్థులందరూ తప్పనిసరిగా వాటిని వేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహిత, అంగన్‌వాడీ, ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

- జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేటలోని రావిసాంబయ్య మున్సిపల్ బాలురోన్నత పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ విద్యార్థులకు ఆల్బెండజోల్ ట్యాబ్లెట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేక్ బీబీజాన్, ప్రధానోపాధ్యాయురాలు మూలాబీ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- పట్టణంలో జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమాల్ని జిల్లా మలేరియా అధికారి టి.ఎం.కె. సుబ్బరాయణం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులందరికీ తప్పనిసరిగా ఆల్బెండజోల్ ట్యాబ్లెట్లను పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు.

కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మాత్రల పంపిణీ

తెనాలి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక సుల్తానాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కోగంటి శివయ్య మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల్ని పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ హాజరయ్యారు. అల్బెండజోల్ మాత్రలు, వాటి ఆవశ్యకత, ఉపయోగాల గురించి విద్యార్థిని, విద్యార్థులకు వివరించారు. నేటి బాలలే రేపటి పౌరులని చెబుతూ వారి ఆరోగ్యం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుల్తానాబాద్ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వూరిబిండి మహిత మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలోని 26 పాఠశాలల్లోని 4,881 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల్ని ఇస్తున్నట్టు చెప్పారు. మిగిలిన వారికి ఈనెల 17న అందజేస్తామని తెలిపారు. క్రమపద్ధతిలో ఏడాదికి రెండునుంచి మూడు మాత్రలు వాడితే పిల్లల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని సూచించారు. దీనివల్ల ఎలాంటి దుష్పరిణామాలు ఉండవని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ పావని, డాక్టర్ సుజిత, డాక్టర్ లాస్య, ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, ఆరోగ్య సూపర్‌వైజర్ పి.వెంకటనరసమ్మ, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లిపరలో...

నులిపురుగుల నివారణతోనే చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని సర్పంచ్ పిల్లి రాధిక తెలిపారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులతో ఆల్బెండజోల్ టాబ్లెట్లను మధ్యాహ్నం భోజనం అనంతరం మింగించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక మాట్లాడుతూ నులి పురుగులు జీర్ణాశయ చిన్న పేగుల్ని అంటిపెట్టుకొని రక్తం పీల్చడం వల్ల మనిషికి రక్తహీనత కలుగుతుందన్నారు. దీని ద్వారా నీరసంగా ఉండి దేనిపై దృష్టి పెట్టలేరని తెలిపారు. అపరిశుభ్రత ద్వారా నులి పురుగులు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ భోజనానికి ముందు మలవిసర్జన తరువాత తప్పక సబ్బుతో చేతులు, కాళ్లు శుభ్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో–1 జి.సాల్మన్‌రాజు, ఎంఈవో–2 కె.ఝాన్సీ, ఆరోగ్యవిస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై.నాగమణి, పిల్లి గంగాధర్, సీఆర్పీ రమేష్ బాబు, ఏఎన్‌ఎంలు , ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన అందిస్తున్న సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- 22వ వార్డులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్.

తెనాలి అర్బన్: గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో అవినీతి రహిత పాలనను ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహనరెడ్డి అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 22వ వార్డు మఠం బజారు నుంచి గురువారం సాయంత్రం ప్రారంభించారు. వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ దుబాయ్ బాబు, నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల్ని అందుకోవాలంటే గతంలో అనేక కష్టాలు పడాల్సి వచ్చేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత లబ్ధిదారుల ఎంపిక నుంచి వారి బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేయడం వరకు ఎంతో పారదర్శకంగా జరుగుతోందని వివరించారు. అందువల్లే లబ్ధిదారులు ప్రభుత్వ విధానాలపై ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం కూడా పాలన అందిస్తోందని తెలిపారు. 22వ వార్డులో ఎక్కువగా మైనార్టీలు, బీసీలు, కాపులు, ఆర్యవైశ్యులు జీవిస్తుంటారన్నారు. కౌన్సిలర్ దుబాయ్‌బాబు వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారని చెప్పారు. వార్డులో ఇప్పటి వరకు రూ.22.08 కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. 645 ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు తెలియజేసిన సమస్యల్ని గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సచివాలయానికి వచ్చే రూ.20లక్షలతో పరిష్కరించనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, రాష్ట్ర కృష్ణ బలిజ పూసల కార్పొరేషన్ డైరెక్టర్ కావేటి నిర్మల, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, మొఘల్ ఆహ్మద్ బేగ్, యాతాటి అనిల్, పేరం సంజీవరెడ్డి, తోట రఘురామ్, కొర్రా యశోద, దాసరి వీర వసంతరావు, షేక్ ఇస్మాయేల్, కో– ఆప్షన్ సభ్యులు పెచ్చింగ్ సుభాని, 22వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు ఈసూబ్, ఖాదర్ మస్తాన్, బాలి, బెజవాడ బాజి, దుబాయ్ సుభాని, జాని, అజ్గర్ ఆలి, బొంబాయ్ బాజి, రియాజ్, చిన్న బాజి, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేయాలి

హిందూ ఐక్యవేదిక డిమాండ్



నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

తెనాలి టౌన్: పంచారామ క్షేత్రాల్లో ప్రఖ్యాతిగాంచిన భీమవరంలోని సోమేశ్వరాలయంలో అర్చకుడిపై దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేయాలని హిందూ ఐక్యవేదిక డిమాండ్ చేసింది. తెనాలి పట్టణం గంగానమ్మపేటలోని పాత శివాలయం గేటు వద్ద గురువారం ఉదయం ఐక్యవేదిక సభ్యులు పెద్దఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. అర్చకుడిపై దాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అర్చక సమాఖ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ తమిరిశ అనంతాచార్యులు మాట్లాడుతూ అర్చకుడిపై దాడి చేసిన ఆలయ ట్రస్ట్ చైర్మన్ భర్త యుగంధర్‌ను అరెస్టు చేయకుండా భార్య విజయలక్ష్మితో పదవికి రాజీనామా చేయించడం సరైన చర్య కాదని పేర్కొన్నారు. హిందూ సంస్థల సోషల్ మీడియా కన్వీనర్ అవ్వారు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవ సమాఖ్య కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణమూర్తి , వైఖానస సేవా సంఘం అధ్యక్షులు మేడూరి శ్రీనివాసమూర్తి , విశ్వహిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, శివాలయం అర్చకులు పొత్తూరి సురేష్, పెనుమూలి పవన్ కుమార్, పొత్తూరి శ్రీకాంత్, వైఖానస సేవా సంఘం ప్రధాన కార్యదర్శి మాధవ కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తమిరిశ రఘు, హిందూ సంస్కృతి పరిరక్షణ సంఘ కన్వీనర్ రొంపిచర్ల కిరణ్ కుమార్, పౌరోహిత సంఘం నాయకులు అవ్వారు శివరాఘవశర్మ, వీహెచ్‌పీ కార్యకర్త కె.రుషి, పలు ధార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు

నిందితుల్లో ఒకరు మైనర్



స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను తెలియజేస్తున్న సీఐ రమేష్‌బాబు

తెనాలి రూరల్: చెడు వ్యసనాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో ఒకరు మైనర్ ఉన్నాడు. కేసు వివరాల్ని త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్ బాబు గురువారం సాయంత్రం వెల్లడించారు. గుంటూరు నెహ్రూనగర్‌కు చెందిన వేముల రేణుకారావు అలియాస్ పండు మరో 14 ఏళ్ల బాలుడు స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు ఖర్చులకు డబ్బుల కోసం బైక్‌లను అపహరించడం ఎంచుకున్నారు. ఇద్దరు కలసి తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ఉంటున్న బాలుడి అక్క ఇంటికి ఇటీవల వచ్చారు. పినపాడు, చెంచుపేట డొంక రోడ్డు, మోరిస్‌పేటలో మూడు బైక్‌లను అపహరించుకెళ్లారు. బైక్ యజమానులు పోలీసుల్ని ఆశ్రయించగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నించారు. చివరకు వీరిని గుర్తించి కదలికలపై నిఘా ఉంచారు. స్థానిక జేఎంజే కళాశాల ఎదురు రోడ్డులో ఉన్నారని తెలుసుకుని సీఐ రమేష్‌బాబు, ఎస్‌ఐ కె. వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్ల రంజిత్, అంకయ్య అక్కడకు వెళ్లి నిందితుల్ని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారిచ్చిన సమాచారం మేరకు మూడు వాహనాల్ని స్వాధీనం చేసుకున్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

తెనాలి రూరల్: మేత కోసం వెళ్లిన గేదె విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తెనాలి మండలం గుడివాడ గ్రామానికి చెందిన బురదగుంట రాంబాబు గేదెలను గ్రామంలోని కొత్తగా ఏర్పాటు చేస్తున్న కాలనీకి తోలుకెళ్లాడు. అక్కడ విద్యుత్ తీగ తెగి ఉండడంతో ఒక గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీంతో రాంబాబు విద్యుత్ తీగ తెగి ఉందన్న విషయాన్ని స్థానికులకు అనంతరం విద్యుత్ శాఖ అధికారులకూ తెలిపాడు. పోలీసుల్ని గురువారం ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ ఎస్‌ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న లారీ సీజ్

తాడికొండ: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని ఎస్‌ఈబీ అధికారులు సీజ్‌చేసి తమకు అప్పగించినట్లు తాడికొండ సీఐ జి. శ్రీనివాసరావు తెలిపారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం నుంచి వస్తున్న లారీని ఆపి తాడికొండ అడ్డరోడ్డులో తనిఖీలు నిర్వహించగా ఎలాంటి బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారన్నారు. కేసు నమోదు చేసిన ఎస్‌ఈబీ అధికారులు తమకు లారీని అప్పగించినట్లు సీఐ తెలిపారు.

దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తలు పాటించాలి



ఇంటింటికి సర్వే నిర్వహిస్తున్న జిల్లా సామాజిక వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణమ్మ

కొల్లిపర: దీర్ఘకాలిక రోగులు వైద్యులు చెప్పిన విధంగా నిత్యం జాగ్రత్తలు పాటిస్తూ, పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా సామాజిక వైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణమ్మ సూచించారు. మండలంలోని అన్నవరం, హనుమాన్‌పాలెం గ్రామాల్లో గురువారం నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఆమె పాల్గొన్నారు. వైద్యశాలల్లో సేవలు, డాక్టర్ వైఎస్సార్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్ సేవల గురించి గ్రామస్తుల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవీంద్రకుమార్, సర్వే పర్యవేక్షకులు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ రాజేష్, డాక్టర్ తులసి, డాక్టర్ నాగేశ్వరరావు ,కొల్లిపర మండల వైద్యాధికారిణి వేముల ప్రియాంక, హెచ్‌వీ భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ గంగవరపు శ్రీనివాసరావు , ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి , ఎంఎల్‌హెచ్ జానీ బేగం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అవయవ దానంపై ప్రజలకు అవగాహన అవసరం

అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి



సీతామహాలక్ష్మికి సన్మానం

మంగళగిరి: అవయవ దానంపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సావిత్రీబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్, అఖిల భారత శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో గురువారం ఈనెల 13వ తేదీన ప్రపంచ అవయవ దానం దినోత్సవం నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ సీతామహాలక్ష్మి మాట్లాడారు. గతంలో శరీరం మాత్రమే దానం చేసేవారని, ప్రస్తుత సమాజంలో అవయవ దానానికి కూడా అనేక మంది ముందుకు రావడం అభినందనీయమన్నారు.అవయవదానంపై సమాజంలో విస్తృత ప్రచారం కల్పించి, ప్రజలకు మరింత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మరణానంతరం తమ దేహాలను దానం చేసేందుకు అంగీకారం తెలిపిన కృష్ణారావు, పాండురంగారావు దంపతులతోపాటు పలువురిని ఆమె అభినందించారు. ఒక వ్యక్తి అవయవాలతో 18 మంది వ్యక్తులకు పునర్జన్మ కలిగించే అవకాశం ఉందన్నారు. అవయవ దానాలపై అపోహలను విడనాడి అందరూ ముందుకు వచ్చి సమాజంలోని తోటి వారికి సహాయపడాలని కోరారు. ఫార్మసీ కళాశాల అనాలసిస్ విభాగం, జాతీయ సేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మిని సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ జి.నిర్మలజ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ప్రొఫెసర్లు రత్నశ్రీ, పి. దేవి, హెచ్‌వోడీ డాక్టర్ పద్మావతి, ప్రోగ్రాం అధికారి రేకా నరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గొడవర్రులో పొలంబడి



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని గొడవర్రు గ్రామంలో గురువారం డాక్టర్ వైఎస్సార్ పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. తెనాలి ఏడీఏ హైమావతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆమె పొలం బడి ముఖ్యోద్దేశాన్ని, విత్తన శుద్ధి చేసుకునే విధానం, దాని వల్ల కలిగే లాభాల్ని రైతులకు వివరించారు. పురుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి పి.శిరీష మాట్లాడుతూ పొలంబడిలో రైతులకు 50 శాతం సబ్సిడీపై జీవ శిలీంధ్ర నాశిని సూడో మోనాస్‌ను రైతులకు అందజేసి, దాన్ని ఏ విధంగా ఉపయోగించాలో సూచించారు. సూడోమోనాస్‌ను వాడడం వల్ల వరిలో అగ్గితెగులు, పాము పొడ, ఆకుమచ్చ తెగుళ్లను అరికట్టవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏఈవో ఎ.రమేష్, గ్రామ వ్యవసాయ అధికారి సీహెచ్. పవన్, పొలంబడి రైతులు పాల్గొన్నారు.